

**భవిష్యత్తుకు బంగారు మెట్టు**
ఇంటర్మీడియట్ విద్య... ఉన్నత చదువులకు మెట్టు. టీనేజ్‌లో చదువుపై ఆసక్తిచూపి భవిష్యత్తును బంగారు మయం చేసుకోవాలని విద్యావేత్తలు సూచిస్తున్నారు. - 8లో



**ఉత్కంఠ భరితంగా ఉమెన్ టీ-20 క్రికెట్ లీగ్** - 8లో
విజయనగరం వేదికగా ఆంధ్రా క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఉమెన్ టీ-20 క్రికెట్ లీగ్ టోర్నీ 3వ రోజు ఉత్కంఠ భరితంగా సాగింది.



**భక్తజన పురం**
చింతాలమ్మా.. చల్లంగ చూడమ్మా... అంటూ భక్తులు స్మరించారు. ఆధ్యాత్మిక చింతనతో గడిపారు. సిరిమాను పూజారి బొట్టంగి తమ్మినాయుడు రూపంలో వీధుల్లోకి వచ్చిన అమ్మవారిని చూసి తరించారు. - 8లో

## న్యూస్‌రీల్

### 9న కలప వేలం

పార్వతీపురం: సాలూరులోని ప్రభుత్వ వెదురు అమ్మకం డిపోలో ఈ నెల 9న కలప వేలం పాట నిర్వహిస్తామని జిల్లా అటవీఅధికారి జీఏపీ ప్రసూన మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. డిపోలో విక్రమానికి సిద్ధంగా ఉన్న రూ.35,24,492లు విలువగల 223 లాట్‌లలో 1389 (79.18 క్యూబిక్ మీటర్ల)దుంగలు, రూ.33,519 విలువగల 28 లాట్‌లలో 40 (24.40 క్యూబిక్ మీటర్లు) దుంగలు, రూ.లక్షా 60వేల670లు విలువగల మూడు లాట్‌లలో 9వేల వెదురు కర్రలు విక్రయానికి ఉన్నాయన్నారు. ఆసక్తి గల వారు సాలూరు వెదురు డిపోలో నిర్వహించే వేలంలో పాల్గొని కొనుగోలు చేయవచ్చని తెలిపారు.

### గురుకుల ప్రవేశాలకు కౌన్సెలింగ్ రేపు

పార్వతీపురం: స్థానిక ఐటీడీఏ గిరిమిత్ర సమావేశమందిరంలో ఈ నెల 8న ఏపీ గిరిజన గురుకుల రెసిడెన్షియల్ కళాశాలల్లో 2023-24 విద్యా సంవత్సరానికి ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరం ప్రవేశానికి కౌన్సెలింగ్ నిర్వహిస్తామని ఐటీడీఏ పీఓ సి.విష్ణుచరణ్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. మే 31వ తేదీలోగా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకున్న ఎస్సీ, ఎస్టీ, బీసీ, ఓసీ కులాలకు చెందిన వారు కౌన్సెలింగ్‌నకు హాజరు కావాలని కోరారు.

### విశాఖపట్నం వెళ్లి పింఛన్ అందజేత



కేజీహెచ్‌లో లబ్ధిదారుకు పింఛన్ అందజేస్తున్న వలంటీర్ పద్మ

గరుగుబిల్లి: విశాఖపట్నంలో కేజీహెచ్‌లో చికిత్స పొందుతున్న పెద్దూరు గ్రామానికి చెందిన బొబ్బిలి సింహాచలంనాయుడుకు వలంటీర్ జి.పద్మ మంగళవారం పింఛన్ అందజేశారు. వ్యయ ప్రయాసలకోర్చి పింఛన్ అందజేసిన వలంటీరును లబ్ధిదారు కుటుంబ సభ్యులు అభినందించారు.

### జాతీయ స్థాయి తైక్వాండో పోటీలకు ఇద్దరు ఎంపిక




జాతీయ స్థాయి తైక్వాండో పోటీలకు ఎంపికైన గగన్‌సాగర్ దొర, భార్గవి

విజయనగరం: జాతీయ స్థాయిలో జరగనున్న తైక్వాండో పోటీలకు జిల్లాకు చెందిన ఇద్దరు క్రీడాకారులు అర్హత సాధించారు. ఉత్తరాఖండ్ రాష్ట్రం డెహ్రాడూన్‌లో ఈ నెల 8వ తేదీ నుంచి 11వ తేదీ వరకు జరగబోయే 38వ సీనియర్స్ స్త్రీ, పురుషుల పోటీలకు ఎం.గగన్‌సాగర్ దొర, వై.భార్గవిలు ఎంపికైనట్లు జిల్లా తైక్వాండో అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు గురాన అయ్యలు, సీహెచ్ వేణుగోపాలరావు తెలిపారు. రాష్ట్ర స్థాయి పోటీల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచి జాతీయ పోటీలకు ఎంపికైన క్రీడాకారులను అభినందించారు. జాతీయ పోటీల్లో పతకాలు సాధించిన విద్యలనగరం ఖ్యాతిని చాటి చెప్పాలని ఆకాంక్షించారు.

### త్వరలో గిరిజన వర్సిటీకి శంకుస్థాపన

- బొబ్బిలి ఆర్డీఓ శేషశైలజ



వర్సిటీ స్థలాన్ని పరిశీలిస్తున్న ఆర్డీఓ శేషశైలజ

దత్తిరాజేరు: గిరిజన వర్సిటీకి భూసేకరణ, రైతులకు నష్టపరిహారం చెల్లింపు శతశాతం పూర్తయిందని, త్వరలో వర్సిటీ పనులకు శంకుస్థాపన చేసేందుకు ఏర్పాట్లు చేస్తామని బొబ్బిలి ఆర్డీఓ శేషశైలజ తెలిపారు. దత్తిరాజేరు మండలం మర్రివలస, మెంటాడ మండలం చినమేడపల్లి మధ్య 561.08 ఎకరాల్లో నిర్మించనున్న గిరిజన యూనివర్సిటీ ప్రాంతాన్ని ఎంపీపీ గేదెల సింహాద్రిఅప్పలనాయుడు, యూనివర్సిటీ ఏఓ సూర్యనారాయణతో కలిసి పరిశీలించారు. హద్దురాళ్లను చూశారు. జాతీయ రహదారి నుంచి వర్సిటీ వరకు నిర్మించనున్న రోడ్డును 100 అడుగుల నుంచి 120 అడుగుల వెడల్పుకు పెంచాలని రోడ్లు భవనాలు శాఖ డీఈ వాణికి సూచించారు. వర్సిటీ పరిసర ప్రాంతాల్లో కంకర అక్రమ తవ్వకాలు జరగకుండా వీఆర్‌ఏలను కాపలా ఉంచాలని తహసీల్దార్ రమేష్‌ను ఆదేశించారు. కార్యక్రమంలో జేఈ నరసింహమూర్తి, సర్వేయర్ సత్యం, వీఆర్వో చిరంజీవి తదితరులు పాల్గొన్నారు.

# పనుల జోరు

- యుద్ధప్రాతిపదికన తోటపల్లి ఆధునికీకరణ పనులు
- పాత కుడి, ఎడమ కాలువల పనులకు జగన్‌మోహన్‌రెడ్డి సర్కారు రూ.193 కోట్ల కేటాయింపు
- ఇప్పటి వరకు చేపట్టిన పనుల విలువ రూ.53 కోట్లు
- మరో పదిరోజుల వరకు సాగనున్న పనులు
- ఖరీఫ్ సీజన్ ముగిశాక మిగులు పనులు చేపట్టేందుకు సన్నాహాలు
- మొత్తం ఆయకట్టు: 63 వేల ఎకరాలు

| తోటపల్లి పాత ఆయకట్టు ఆధునికీకరణ పనుల వివరాలు |
|---|
| ఎడమ కాలువ మొత్తం పొడవు: 37 కి.మీ. |
| ఇప్పటి వరకు జరిగిన పనులు ఇలా.. |
| కాంక్రీట్ లైనింగ్ పనులు : 22 కి.మీ. |
| మట్టి పనులు:7 కి.మీ. |
| కాలువపై చేపట్టిన వంతెనలు -5 |
| మిగిలిన పనులు: 8 కి.మీ |
| కుడి కాలువ పొడవు: 20 కి.మీ. |
| ఇప్పటి వరకు జరిగిన పనులు: 12 కి.మీ |
| ప్రస్తుతం చేపడుతున్న పనులు: పూడికలు తొలగించడం, లైనింగ్ చేయడం, వంతెనలు, స్లూయీజ్‌ల నిర్మాణం |

| ఆయకట్టు వివరాలు |
|---|
| ఎడమకాలువ పరిధిలోని మండలాలు: జియ్యమ్మవలస, గరుగుబిల్లి, వీరఘట్టం, పాలకొండ, బూర్జ |
| ఆయకట్టు: 32 వేల ఎకరాలు |
| కుడికాలువ పరిధిలోని మండలాలు: గరుగుబిల్లి, బలిజిపేట, వంగర |
| ఆయకట్టు: 7,543 ఎకరాలు |
| రెండు కాలువల పరిధిలో ఉన్న అదనపు ఆయకట్టు: సుమారు 23,457 ఎకరాలు |



వీరఘట్టం మండలం కత్తులకవిటి-హుస్సేనుపురం మధ్యలో జరుగుతున్న ఎడమకాలువ లైనింగ్ పనులు

వీరఘట్టం:

రైతు బాగుంటేనే రాష్ట్రం.. దేశం బాగుంటుందన్న ఉద్దేశంతో జగన్‌మోహన్‌రెడ్డి సర్కారు వ్యవసాయానికి పెద్దపీట వేస్తోంది. సాగుకు చేయూతనిస్తోంది. నీటివనరుల సంరక్షణకు అధిక ప్రాధాన్యమిస్తోంది. జలయజ్ఞంలో భాగంగా ప్రాజెక్టుల ఆధునికీకరణ పనులను చకచకా పూర్తిచేయిస్తోంది. ఖరీఫ్‌కు సమృద్ధిగా సాగునీరు అందించాలన్న లక్ష్యంతో ముందుకు సాగుతోంది. ఇందులో భాగంగానే తోటపల్లి ప్రాజెక్టు కుడి, ఎడమ కాలువల ఆధునికీకరణ పనులను యుద్ధప్రాతిపదికన పూర్తిచేయిస్తోంది. గతంలో రూ.139 కోట్ల అంచనా వ్యయంతో కాలువల పనులకు ప్రతిపాదనలు సిద్ధం కాగా ఈ పనులు అంచనా వ్యయం గతేడాది రూ.193 కోట్లుకు చేరింది. ఇందులో రూ.163 కోట్ల సాంకేతిక అనుమతులతో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం మంజూరు చేసింది. 2019లో అధికారంలోకి వచ్చిన వెంటనే ప్రాజెక్టు పనుల బకాయిలు రూ.23 కోట్లను చెల్లించింది.

**ఇదీ పరిస్థితి...**
తోటపల్లి ప్రాజెక్టు పాత, కుడి ఎడమ కాలువలను ప్రభుత్వం ఆధునీకరిస్తోంది. మొత్తం 500కు పైగా పనులు చేపట్టింది. రెండు కాలువలు కలిపి మొత్తం 57 కి.మీ పొడవున విస్తరించి ఉండగా, ఇందులో దాదాపు 34 కి.మీ వరకు కాంక్రీట్ లైనింగ్ పనులు పూర్తయ్యాయి. కాలువ అడుగు భాగంలో 6 నుంచి 12 మీటర్లు వెడల్పున మట్టితో బైండింగ్ చేయడంతో పాటు అక్కడి నుంచి కాలువ గట్ల లైనింగ్ పనులు సాగుతున్నాయి. కాలువలకు 200 చోట్ల చిన్న పెద్ద వంతెనలు నిర్మించడంతో పాటు మరో 300 చోట్ల స్లూయీజ్‌లు, చప్టాలు, డ్రాఫ్ట్ వంతెనలు నిర్మితం కానున్నాయి. ముందుగా లైనింగ్ పనులు పూర్తిచేసి టైలెండ్ వరకు సాగునీటిని అందించేలా నీటిపారుదల శాఖ అధికారులు పనులు చేపడుతున్నారు. రెండు కాలువల ద్వారా మొత్తం 63 వేల ఎకరాలకు సాగునీరు అందనుంది. ఈ ఏడాది ఖరీఫ్ నాటికి ఎటువంటి ఇబ్బందులు లేకుండా మొత్తం ఆయకట్టుకు జూన్ చివరి వారంలో సాగునీరు అందించే లక్ష్యంతో పనులు ముమ్మరం చేశారు.

**చకచకా కాలువల పనులు**
తోటపల్లి పాత ఆయకట్టు కాలువల పనులు ప్రస్తుతం చకచకా సాగుతున్నాయి. ఎడమ కాలువలో ఇంత వరకు 22 కి.మీ పరిధిలో కాంక్రీట్ పనులు పూర్తయ్యాయి. 23-37 కి.మీల మధ్యలో హుస్సేనుపురం నుంచి పాలకొండ మండలం వెలగవాడ వరకు ఎర్త్, లైనింగ్ పనులు చకచకా చేస్తున్నారు. ఇలా ఇంత వరకు రూ.53 కోట్లు విలువగల పనులు చేపట్టినట్టు అధికారులు చెబుతున్నారు.

**ఆక్విడెట్ నిర్మించేందుకు ప్రభుత్వం గ్రీన్ సిగ్నల్**
ఎడమకాలువలో పెద్దబుడ్డిడి వద్ద ఉన్న బ్రిటిష్ కట్టడం సైఫూన్ స్థానంలో 100 మీటర్లు పొడవు, 5 మీటర్లు వెడల్పు, 2 మీటర్లు ఎత్తు ఉండేలా ఆక్విడెక్టు నిర్మించేందుకు జలవనరులశాఖ అధికారులు డిజైన్ రూపొందించి కొద్ది రోజుల క్రితం ప్రభుత్వానికి నివేదించారు. ఈ డిజైన్‌ను ప్రభుత్వం ఆమోదిస్తూ సైఫూన్‌ను తొలగించి ఇక్కడ ఆక్విడెక్టు నిర్మించేందుకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. ఈ ఏడాది ఖరీఫ్ సీజన్ నవంబర్ నెలతో ముగియనుంది. డిసెంబర్ నుంచి సైఫూన్‌ను తొలగించనున్నట్టు జలవనరులశాఖ అధికారులు చెబుతున్నారు.

**మరో పది రోజుల వరకు పనులు**



ప్రస్తుతం వాతావరణం అనుకూలంగా ఉండడంతో పనులు చురుగ్గా జరుగుతున్నాయి. మరో పదిరోజుల వరకు కాలువ పనులు చేపట్టి జూన్ చివరి వారంలో కాలువలకు నీరు విడుదల చేస్తాం. ప్రభుత్వం నుంచి పూర్తి సహకారం ఉండడంతో పనులు వేగవంతంగా చేపడుతున్నాం. అదనపు ఆయకట్టుకు సాగునీరు అందించే దిశగా పనులు చేస్తున్నాం.
– దమలపాటి రవికుమార్, తోటపల్లి కాలువల ఆధునికీకరణ పనుల డీఈఈ

## చంద్రబాబువి మోసపూరిత హామీలు

- వాటిని రైతులు నమ్మే పరిస్థితిలేదు
- ఉపముఖ్యమంత్రి పీడిక రాజన్నదొర



మాట్లాడుతున్న డిప్యూటీ సీఎం పీడిక రాజన్నదొర

సాలూరు: టీడీపీ అధినేత చంద్రబాబువి మోసపూరిత హామీలని, వాటిని నమ్మే పరిస్థితిలో రైతులు లేరని డిప్యూటీ సీఎం, గిరిజన సంక్షేమశాఖ మంత్రి పీడిక రాజన్నదొర అన్నారు. సాలూరులోని తన స్వగృహంలో స్థానిక విలేకరులతో ఆయన మంగళవారం మాట్లాడారు. వ్యవసాయం దండగంటూ చంద్రబాబు గతంలో తెలిపిన మాటలు, ఆయన పాలనలో బషీరాబాద్‌లో రైతులపై జరిపిన కాల్పులను తెలుగు ప్రజలు, రైతులెవ్వరూ మర్చిపోలేదన్నారు. రైతుల రుణాలు మాఫీచేస్తానన్న హామీతో 2014లో అధికారంలోకి వచ్చిన చంద్రబాబు రూ.87 వేల కోట్లకు కేవలం రూ.15 వేల కోట్లు మాత్రమే మాఫీ చేసి రైతులకు ఆవేదన మిగిల్చారన్నారు. అన్నదాత పథకం కింద ఏడాదికి రూ.20 వేలు అందిస్తామని మహానాడు సాక్షిగా మరో అబద్ధపు హామీ ఇచ్చారని ఎద్దేవాచేశారు. రైతే దేశానికి వెన్నెముకగా భావించిన ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి రైతులకు అండగా నిలుస్తున్నారన్నారు. విత్తనం నుంచి పంట కొనుగోలు వరకు రైతులకు చేదోడునిచ్చేలా ఊరూరా రైతుభరోసా కేంద్రాలను ఏర్పాటుచేశారన్నారు. రాష్ట్రంలో 53 లక్షల మంది రైతులకు నాలుగేళ్లలో వైఎస్సార్ రైతు భరోసా కింద రూ.30,985 కోట్ల నిధులను పెట్టుబడి సాయంగా రైతుల ఖాతాలకు జమచేసిన ఘనత జగన్‌మోహన్‌రెడ్డి సర్కారుకే దక్కుతుందన్నారు. ఉచిత పంటల బీమా కింద సుమారు 43 లక్షల మంది రైతులకు రూ.6,685 కోట్ల పరిహారం అందించినట్టు వెల్లడించారు. రైతులకు ఉచిత విద్యుత్ రాయితీ పథకం కింద రూ.34,200 కోట్ల సాయం చేసినట్టు తెలిపారు. వ్యవసాయానికి పగటిపూట 9 గంటల పాటు నాణ్యమైన విద్యుత్తును సరఫరా చేస్తున్నట్టు వివరించారు. గత చంద్రబాబు ప్రభుత్వం ఆక్వా రైతులకు ఎగ్గొట్టిన రూ.452 కోట్లతో పాటు రూ.2,962 కోట్లను వైఎస్సార్‌సీపీ ప్రభుత్వమే చెల్లించిందన్నారు. ఎన్నికలు సమీపిస్తున్న వేళ రైతులను మరోసారి మోసం చేసేందుకు చంద్రబాబు చెబుతున్న మోసపూరిత హామీలను రైతులు నమ్మే పరిస్థితి లేదన్నారు. చంద్రబాబు రైతు ద్రోహిగా, జగన్‌మోహన్‌రెడ్డి రైతు నేస్తంగా పేరొందారన్నారు.

## పాఠశాల తెరిచిన రోజే.. జగనన్న విద్యాకానుకల పంపిణీ

- ఇప్పటికే మండల కేంద్రాలకు చేరిన విద్యాకానుకలు
- తరగతుల వారీగా విభజన
- పాఠశాలలకు చేర్చుతున్న అధికారులు
- జిల్లాలో 1,21,267 మంది విద్యార్థులు
- ప్రతి ఒక్కరికి జేవీకే కిట్లు అందేలా చర్యలు



పుస్తకాలను పరిశీలిస్తున్న డీఈఓ ప్రేమ్ కుమార్

పార్వతీపురం టౌన్: పేద విద్యార్థుల చదువుకు వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అండగా నిలుస్తోంది. కార్పొరేట్ స్కూల్స్‌ను తలదన్నేలా సర్కారు బడులను నాడు-నేడు పనులతో సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దుతోంది. చదువుకునేందుకు ఆహ్లాదకర వాతావరణం కల్పిస్తోంది. ప్రమాణాలతో కూడిన విద్యాబోధన సాగేలా ప్రణాళికలు రూపొందిస్తోంది. 'అమ్మఒడి'తో చదువుకు ఆర్థిక భరోసా కలిస్తోంది. ప్రభుత్వ బడుల్లో చదివే విద్యార్థుల్లో ఆత్మవిశ్వాసం నింపేలా బడి తెరిచిన రోజే విద్యార్థులకు జగనన్న విద్యాకానుక కిట్లను అందించేందుకు రంగం సిద్ధం చేసింది. పాఠశాలలోకి అడుగుపెట్టిన క్షణంలోనే ఎనిమిది రకాల వస్తువులతో కూడిన కిట్టును తీసుకోనున్నారు. విద్యాకానుకలను ఇప్పటికే మండల కేంద్రాలకు చేర్చారు. జిల్లాలో ప్రభుత్వ బడుల్లో చదువుతున్న 1,21,267 మంది విద్యార్థులకు తొలి రోజే విద్యాకానుకలు అందించేందుకు అధికారులు చర్యలు చేపట్టారు.

**ఎనిమిది రకాల వస్తువులు..**
ప్రభుత్వం పరిధిలో వివిధ యాజమాన్యాల కింద నడుస్తున్న పాఠశాలల విద్యార్థులకు జగనన్న విద్యాకానుక పేరుతో 8 రకాల అభ్యసన సామగ్రి, ఇతర వస్తువులను అందజేయనున్నారు. జేవీకే కిట్టులో మూడు జతల యూనిఫాం, పాఠ్య పుస్తకాలు, నోటుపుస్తకాలు, ఇంగ్లిష్ డిక్షనరీ, బెల్ట్, బూట్లు, రెండు జతల సాక్సులను బ్యాగులో పెట్టి విద్యార్థులందరికీ అందజేస్తారు.



జగన్న విద్యాకానుకలు

**విద్యార్థులకు వరం**
వారం రోజుల్లోలో పాఠశాలలు తెరచుకోనున్నాయి. విద్యార్థులు పాఠశాలకు వచ్చిన తొలిరోజే జగనన్న విద్యాకానుకలు అందించేందుకు కసరత్తు చేస్తున్నాం. ఎమ్మార్సీలకు చేరిన జగనన్న విద్యాకానుక కిట్స్ అక్కడ నుంచి పాఠశాలలకు తరలించి విద్యార్థులకు అందిస్తాం. నాణ్యమైన విద్యాకానుకలను ప్రభుత్వం అందజేస్తోంది. అన్ని సబ్జెక్టుల పుస్తకాలు, బ్యాగ్స్, షూస్, డిక్షనరీ వంటివి విద్యార్థుల చదువుకు ఉపయోగకరంగా ఉంటాయి.
– ఎన్.ప్రేమ్‌కుమార్, జిల్లా విద్యాశాఖాధికారి, పార్వతీపురం మన్యం

జిల్లాలో 1 నుండి 9వ తరగతి వరకు చదువుతున్న విద్యార్థులు ఇలా

| తరగతి | విద్యార్థుల సంఖ్య |
|---|---|
| 1 | 10,938 |
| 2 | 10,867 |
| 3 | 13,138 |
| 4 | 13,656 |
| 5 | 13,046 |
| 6 | 12,584 |
| 7 | 12,079 |
| 8 | 11,494 |
| 9 | 11,228 |

## ఉన్నత స్థాయికి ఎదగాలి



ధ్రువపత్రాలతో అభ్యర్థులు, అధికారులు

పార్వతీపురంటౌన్: శిక్షణ పొంది ఉద్యోగాలు పొందడం శుభ పరిణామమని, ఉద్యోగంలో రాణించి ఉన్నత స్థాయికి ఎదగాలని డీఆర్‌డీఏ పీడీ పి.కిరణ్ కుమార్ శిక్షణార్థులకు సూచించారు. ఎమ్మార్ నగరంలోని ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో నిర్వహించిన సీఆర్‌ఎం డొమెస్టిక్ వాయిస్ కోర్సు ముగింపు కార్యక్రమం మంగళవారం జరిగింది. శిక్షణ పొందిన యువతీ యువకులకు ధ్రువపత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా జిల్లా నైపుణ్యాభివృద్ధి స్పెషల్ ఆఫీసర్ టి.వినోద్ మాట్లాడుతూ ప్రతీ చిన్న అవకాశాన్ని అందిపుచ్చుకొని ఉన్నత స్థానాలకు వెళ్లాలన్నారు. కార్యక్రమంలో జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి యు. సాయికుమార్, ప్రిన్సిపాల్ విలియం కేరీ, తదితరులు పాల్గొన్నారు.

## పోలీస్ ఉద్యోగులకు ఆరోగ్య భరోసా



వైద్యశిబిరాన్ని ప్రారంభిస్తున్న ఎస్పీ ఎం.దీపిక

విజయనగరం క్రైమ్: జిల్లాలోని పోలీసు ఉద్యోగుల ఆరోగ్య పరిరక్షణ కోసం వైద్య శిబిరాన్ని నిర్వహించినట్టు ఎస్పీ ఎం.దీపిక తెలిపారు. వివిధ పోలీస్ స్టేషన్లలో పనిచేస్తున్న కిందిస్థాయి ఉద్యోగుల ఆరోగ్య పరిరక్షణకు తిరుమల మెడికవర్ ఆస్పత్రి సహకారంతో జిల్లా పోలీస్ కార్యాలయంలో మంగళవారం నిర్వహించిన వైద్యశిబిరాన్ని ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సకాలంలో వైద్య పరీక్షలు చేయించుకోకపోవడం వల్ల ఆరోగ్య సమస్యలను గుర్తించక అర్ధాంతరంగా మృతిచెందడం, తీవ్రమైన అనారోగ్యానికి గురికావడం వంటివి జరుగుతున్నాయన్నారు. వీటిని అధిగమించేందుకు జిల్లా పోలీసుశాఖలో పనిచేస్తున్న హోంగార్డు నుంచి పై స్థాయి అధికారి వరకూ ఉచితంగా వైద్యపరీక్షలు నిర్వహించి, అవసరమైన వైద్యసేవలు అందించేందుకు తమవంతు కృషిచేస్తున్నామన్నారు. వైద్యశిబిరంలో డాక్టర్ తిరుమల ప్రసాద్, ఏఎస్పీ (అడ్మిన్) అస్మా ఫర్హీన్, ఎస్సీ, ఎస్టీ సెల్ డీఎస్పీ ఆర్.శ్రీనివాసరావు, ఏఆర్ డీఎస్పీ ఎల్.శేషాద్రి తదితరులు పాల్గొన్నారు.

## సీట్లు పెంచండి

- ఐటీడీఏ పీఓను కోరిన ఎమ్మెల్యే కళావతి



పీఓతో పలు అంశాలపై చర్చిస్తున్న ఎమ్మెల్యే కళావతి, పక్కన సబ్‌కలెక్టర్ నూరుల్‌కమర్

సీతంపేట: గిరిజన గురుకులాల్లో ఆరు, ఎనిమిదో తరగతిలో అధికమంది విద్యార్థులకు ప్రవేశాలు కల్పించేలా సీట్లు పెంచాలని పాలకొండ ఎమ్మెల్యే విశ్వాసరాయి కళావతి ఐటీడీఏ పీఓ కల్పనాకుమారిని కోరారు. ఐటీడీఏలో పలు అంశాలపై పీఓతో ఎమ్మెల్యే మంగళవారం చర్చించారు. నాడు-నేడు పనులు పాఠశాలలు పునఃప్రారంభమయ్యేనాటికి పూర్తిచేసేలా పర్యవేక్షించాలని కోరారు. గ్రామాల్లో సోలార్ రక్షిత మంచినీటి పథకాలు కొన్ని మొరాయించాయని వాటి బాగుచేయాలని పీఓకు విజ్ఞప్తిచేశారు. ఇంటింటికీ వేస్తున్న కుళాయికనెక్షన్లు త్వరితగతిన పూర్తి చేయాలన్నారు. గ్రామాల్లో మంచినీటి సమస్యలు లేకుండా చూడాలన్నారు. ప్రభుత్వం మంజూరు చేసిన రోడ్ల నిర్మాణాలు వేగవంతంగా పూర్తిచేసేలా సంబంధిత అధికారులను ఆదేశించాలన్నారు. కార్యక్రమంలో పాలకొండ సబ్‌కలెక్టర్ నూరుల్ కమర్ పాల్గొన్నారు.

## జిల్లాకు 27 క్వింటాళ్ల వరి విత్తనాలు




సమీక్ష సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ నిషాంత్‌కుమార్

- కలెక్టర్ నిషాంత్‌కుమార్

పార్వతీపురం: జిల్లాకు 27 క్వింటాళ్ల వరి విత్తనాలు కేటాయించగా, ఇప్పటికే 14 క్వింటాళ్ల విత్తనాలు వచ్చినట్టు కలెక్టర్ నిషాంత్‌కుమార్ తెలిపారు. వ్యవసాయ, అనుబంధ రంగాల పురోగతిపై మండలాధికారులతో వీడియోకాన్ఫరెన్స్‌లో మంగళవారం సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ రైతు భరోసా కేంద్రాల్లో ఎరువులు, విత్తనాలు అందుబాటులో ఉంచాలన్నారు. విత్తనాలకు రిజిస్ట్రేషన్లు చేయించాలన్నారు. పచ్చి రొట్ట విత్తనాలు 18 వేల క్వింటాళ్లను రైతు భరోసా కేంద్రాలకు అందించగా, ఇప్పటికే 50 శాతం పంపిణీ చేసినట్టు వెల్లడించారు. యంత్ర సేవా పథకంలో డ్రోన్ పైలెట్ కోసం 45 మంది అవసరం ఉండగా 11 మందిని మాత్రమే ఎంపిక చేశారని, మిగిలిన 34 మందిని గుర్తించాలని, యువరైతులకు ప్రాధాన్యమివ్వాలన్నారు. పీఎమ్ కిసాన్‌కు అర్హత గల రైతులందరికీ ఈకేవైసీ చేయించాలన్నారు. జిల్లాలో ఉద్యాన పంటలు అభివృద్ధిలో భాగంగా నిర్దేశించిన 2,300 హెక్టార్లలో ప్లాంటేషన్‌ను పూర్తిచేయాలన్నారు. వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని ఆదేశించారు. జిల్లాకు మంజూరు చేసిన 68 ఫిష్ ఆంధ్రా షాపుల ఏర్పాటుకు రుణాలు మంజూరు చేయాలని తెలిపారు. సమావేశంలో జిల్లా వ్యవసాయ అధికారి కె.రాబర్ట్ పాల్, జిల్లా ఉద్యాన అధికారి కె.ఎస్.ఎస్. రెడ్డి, జిల్లా మత్స్యశాఖ అధికారి వి.తిరుపతయ్య, తదితరులు పాల్గొన్నారు.

**పరిశుభ్రమైన గ్రామాలు ఆవిష్కృతం కావాలి**
పరిశుభ్రమైన గ్రామాలు ఆవిష్కృతం కావాలని, అందుకు స్వచ్ఛభారత్ ఉద్యమాన్ని ముమ్మరం చేయాలని కేంద్ర జలశక్తి మంత్రిత్వశాఖ తాగునీరు, పారిశుద్ధ్య విభాగం కార్యదర్శి వి.మహాజన్ పిలుపునిచ్చారు. స్వచ్ఛభారత్ ఉద్యమం, జలజీవన్ మిషన్‌పై రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డా.కె.ఎస్.జవహర్ రెడ్డితో కలిసి కలెక్టర్లతో విజయవాడ నుంచి వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రధాన కార్యదర్శి మాట్లాడుతూ ప్రతిగ్రామాన్ని బహిరంగ మలవిసర్జన లేని గ్రామాలుగా తీర్చిదిద్దాలన్నారు. సాలిడ్, లిక్విడ్ వేస్ట్ మేనేజ్‌మెంట్, ప్లాస్టిక్ వేస్ట్‌మేనేజ్‌మెంట్‌ను పక్కాగా నిర్వహించాలన్నారు. జలజీవన్ మిషన్ కింద ప్రతీ ఇంటికి రక్షిత తాగునీరు సరఫరా చేయాలన్నారు. వీడియో కాన్ఫరెన్స్‌లో కలెక్టర్ నిషాంత్‌కుమార్, ఆర్‌డబ్ల్యూఎస్ ఇంజినీరింగ్ అధికారి ఒ.ప్రభాకరరావు, తదితరులు పాల్గొన్నారు.

## క్లుప్తంగా

### ఆలయ హుండీ చోరీ

• సుమారు రూ.15వేలు మాయం?



పొలాల్లో పడి ఉన్న హుండీ

కొత్తవలస: మండల కేంద్రంలోని కొత్తవలస–విజయనగరం రోడ్డులో పాతసుంకరపాలెం గ్రామం సమీపంలో గల పంచముఖస్వామి ఆలయంలోని హుండీని గుర్తు తెలియని వ్యక్తులు సోమవారం రాత్రి దొంగిలించారు. మంగళవారం ఉదయం స్వామివారి ఆలయం శుద్ధి చేసేందుకు గ్రామస్తులు వెళ్లి చూడగా హుండీ కనిపించలేదు.దీంతో చుట్టుపక్కల వెతకడం ప్రారంభించారు. గ్రామానికి సుదూరంగా పంట పొలాల్లో హుండీ పగలగొట్టి ఉండడం గుర్తించారు. ఈ హుండీ ఆదాయాన్ని ప్రతి ఆరునెలలకు ఒక సారి లెక్కిస్తారు. ప్రస్తుతం హుండీలో సుమారు రూ.15వేలు ఉంటాయని గ్రామస్తులు చెబుతున్నారు. ఈ మేరకు పోలీస్‌లకు ఫిర్యాదు చేశారు.

### అనుమానంతో భార్యపై భర్త దాడి



చికిత్స పొందుతున్న దేవి

పార్వతీపురం: భార్యపై అనుమానం పెంచుకున్న భర్త ఆమెపై దాడిచేసి గాయపరిచాడు. సోమవారం రాత్రి జరిగిన ఈ సంఘటనపై మంగళవారం పార్వతీపురం ఆస్పత్రి అవుట్‌పోస్టు పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. గరుగుబిల్లి మండలం కొంకడివరం గ్రామానికి చెందిన బి.దేవి కోలాటానికి వెళ్లి ఇంటికి వచ్చింది. ఎవరితో వెళ్లావని భర్త రమేష్ అనుమానంతో దేవిని దుర్భాషలాడి పలు చోట్ల గాయపరిచాడు. ఈ మేరకు చికిత్సకోసం మంగళవారం ఉదయం ఆస్పత్రికి తరలించారు.

### విద్యుత్ షాక్‌తో బాలుడి మృతి

సీతంపేట: మండలంలోని మొగదార గ్రామానికి చెందిన బాలుడు చీమల ప్రేమ్‌కుమార్ (3) విద్యుత్ షాక్‌తో మంగళవారం సాయంత్రం మృతి చెందాడు. శ్లాబ్ ఇంటి ముందు వేసిన రేకులకు సపోర్టుగా ఉన్న ఐరన్‌పోల్‌కు ఇంటినుంచి ఊహించని రీతిలో విద్యుత్ సరఫరా కావడంతో అక్కడ ఆడుకుంటున్న బాలుడు ప్రమాదానికి గురయ్యాడు. వెంటనే స్థానిక ఏరియా ఆసుపత్రికి వైద్యసేవల నిమిత్తం తీసుకువెళ్లగా అప్పటికే మృతిచెందినట్టు వైద్యులు నిర్ధారించారు. తల్లిదండ్రులు వినోద్‌కుమార్, మీనాలు గుండెలవిసేలా రోదించారు. ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై ఎ.నీలకంఠరావు తెలిపారు.

### రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి గాయాలు

పూసపాటిరేగ: స్థానిక సినిమా హాలు సమీపంలో జాతీయ రహదారిపై మంగళవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తికి తీవ్ర గాయాలయ్యాయి. మోటార్‌సైకిల్‌పై వెళ్తుండగా అదుపుతప్పి బోల్తా పడటంతో తీవ్ర గాయాలయ్యాయి. గాయపడిన వ్యక్తి డెంకాడ మండలం అక్కివరం గ్రామానికి చెందిన ఎం. శ్రీనివాసరావుగా గుర్తించారు. గాయపడిన వ్యక్తిని విజయనగంలోని ఓ ప్రవేటు ఆస్పత్రికి చికిత్స నిమిత్తం 108 వాహనంలో తరలించారు.

### 20న చలో విజయవాడ

విజయనగరం పూల్‌బాగ్: భవన నిర్మాణ రంగ కార్మికులకు పెండింగ్ క్లెయిములు పరిష్కారం కోసం ఈ నెల 20న చలో విజయవాడ కార్యక్రమానికి పిలుపునిస్తున్నామని ఏపీ బిల్డింగ్ అండ్ కన్‌స్ట్రక్షన్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పదాల రమణ తెలిపారు. స్థానిక అమర్‌భవన్‌లో మంగళవారం విలేకర్ల సమావేశం జరిగింది. కార్యక్రమంలో ఏఐటీయూసీ నాయకులు బి.అశోక్, ఎస్.రంగరాజు, బి.గురువారెడ్డి, అల్లి మారయ్య, ఎస్.సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

### మృతులకు సంతాపం



రైలు ప్రమాద మృతులకు సంతాపం తెలుపుతున్న సభ్యులు

విజయనగరం: ఒడిశాలోని బాలాసోర్ రైలు ప్రమాదం దేశ చరిత్రలో అత్యంత విషాదకరమైన దుర్ఘటన అని మానవ హక్కుల సంరక్షణ సంస్థ జిల్లా మహిళా అధ్యక్షురాలు పెంటపాటి రుక్మిణి పేర్కొన్నారు. పట్టణంలోని మూడు కోవెల సమీపంలో మానవ హక్కుల సంరక్షణ సంస్థ జిల్లా శాఖ ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించిన ప్రత్యేక కార్యక్రమంలో బాలాసోర్ ప్రమాదంలో మృతి చెందిన వారికి కొవ్వొత్తులతో సంతాపం తెలిపారు. సంస్థ నేషనల్ చైర్మన్ రాజాన ప్రసాదరావు ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో విజయనగరం జిల్లా ప్రధాన కార్యదర్శి వై.కిషోర్, కార్యదర్శి కె.వి.రమణమూర్తి, నేషనల్ మీడియా సెక్రటరీ రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

### 11న మోడల్‌స్కూల్ ప్రవేశపరీక్ష

మెరకముడిదాం: గర్భాం ఏపీ మోడల్ స్కూల్‌లో 6వ తరగతిలో ప్రవేశాలకు ఈనెల 11న అదే స్కూల్ కేంద్రంగా పరీక్ష నిర్వహించ నున్నట్లు ప్రిన్సిపాల్ డి.వి.ఎస్.అరుణ మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఇది వరకు దరఖాస్తు చేసుకున్న విద్యార్థులు తమ హాల్ టికెట్లను ఏపీఎంఎస్.ఏపీసీ ఎఫ్ఎస్ఎస్.ఇన్ వెబ్‌సైట్ నుంచి డౌన్‌లోడ్ చేసుకోవాలని పేర్కొన్నారు.

# భవిష్యత్తుకు బంగారు మెట్టు



కొత్తగా కళాశాలకు వెళ్తున్న విద్యార్థులు

• క్రమశిక్షణతోనే విజయం సాధ్యం
• ఇంటర్‌మీడియట్‌లో తప్పటడుగు వేస్తే భవిష్యత్ అధోగతే
• ప్రారంభమైన జూనియర్ కళాశాలలు
• విద్యార్థులు జాగ్రత్తలు పాటించాలంటున్న వ్యక్తిత్వ వికాస నిపుణులు

రాజాం సిటీ: ఇంతవరకు తల్లిదండ్రుల పర్యవేక్షణలో, సొంత ఊరిలో పాఠశాల చదువు పూర్తి చేసుకున్న విద్యార్థులు కళాశాల వాతావరణంలోకి అడుగుపెడుతున్నారు. పదో తరగతి పూర్తి చేసి ఇంటర్‌మీడియట్‌లో చేరే విద్యార్థులకు కొత్త అనుభవం. ఈ క్రమంలో కొత్తగా కళాశాలల్లో చేరే విద్యార్థులతో కొత్త పరిచయాలు..కొత్త వాతావరణం..కొత్త పరిసరాలు..సరికొత్త ఆలోచనలు అన్నీ కొత్తదనాన్ని ఇచ్చేవే. ఇష్టపడి కళాశాలల్లో అడుగుపెడుతున్న విద్యార్థులకు ఇవన్నీ కొత్తగా కనిపిస్తాయి. ఇది టీనేజీలో అత్యంత కీలక సమయమే కాకుండా జీవితాన్ని మలుపుతిప్పే దశ. ఏ మాత్రం తొందరపాటు నిర్ణయం తీసుకున్నా జీవితం తిరిగి రానంత వెనక్కి వెళ్లి పరాజయం బాట పడుతుంది. ఇంటర్‌మీడియట్‌లో కొత్తగా చేరే విద్యార్థులు జాగ్రత్తలు పాటిస్తూ ఎలాంటి ఆకర్షణలు, ప్రలోభాలు, చెడు సావాసాలకు గురి కాకుండా ముందుకెళ్తే భవిష్యత్ బంగారమయం కానుంది. ఈ ఏడాది జూన్ 1 నుంచే కళాశాలలు ప్రారంభమయ్యాయి. ఈ ఏడాది పదో తరగతిలో ఉత్తీర్ణులైన వారంతా ఇంటర్మీడియట్ ప్రథమ సంవత్సరంలో చేరుతున్నారు.

**చదువుకే తొలిప్రాధాన్యం ఇవ్వాలి**

విద్యార్థులు కళాశాల జీవితంలోకి అడుగుపెట్టి ఎన్నో ఆకర్షణలకు లోనవుతుంటారు. అయితే ఈ దశలో అందరికీ చదువే తొలిప్రాధాన్యం కావాలి. జీవితం అల్లరిపాలు చేసుకోకుండా చూసుకోవాలి. సినిమాల ప్రభావంతో కళాశాలలు ఎగ్గొట్టడం, హీరోయిజం చూపించడం వంటివి చేయకూడదు. విధిగా తరగతులకు హాజరై పాఠ్యాంశాలపై దృష్టిసారించాలి. మంచి స్నేహాలవైపు అడుగులువేసి పోటీ పరీక్షలకు సంబంధించి విజ్ఞానం పెంచుకోవడం శ్రేయస్కరం.

**ప్రభావితం చేయనున్న స్నేహాలు**

ఇంటర్‌మీడియట్‌లో చేరగానే విద్యార్థులను ప్రభావితం చేసే తొలి అంశం స్నేహం. అదృష్టం కొద్ది ఉన్నత భావాలున్న వారితో స్నేహం కుదిరితే జీవితం ఓ గాడిలో పడుతుంది. లేదంటే ప్రమాదంలో పడే అవకాశం లేకపోలేదు. చదువుపై ఇష్టం, సమాజంపై అవగాహన, అధ్యాపకులపై సదభిప్రాయం ఉన్న వారితో స్నేహం చేయాలి. అలాంటి దృక్పథంతోనే ముందుకు సాగాలి. లేదంటే చెడు వ్యసనాలకు అలవాటుపడి జీవితాలు అంధకారమయ్యే ప్రమాదం ఉంది. సిగరెట్లు, గుట్కా, మత్తు పదార్థాలు, మద్యం లాంటి వాటికి దూరంగా ఉంటే మంచిది. ఇలాంటి వాటికి ఇంటర్మీడియట్ దశలోనే బీజం పడుతుంది. అపరిచిత వ్యక్తులతో సోషల్ మీడియా ద్వారా చాటింగ్, పార్టీలు, వేడుకల పేరుతో స్నేహితులు చెడుదారుల వైపు తీసుకువెళ్లే ఆస్కారముంటుంది. సినిమాల ప్రభావం, స్నేహితుల ప్రోత్సాహంతో ప్రేమాయణం అంటూ మనస్సును కలుషితం చేసుకోవద్దు.

### భవిష్యత్ అంధకారం చేసుకోవద్దు



పదో తరగతి తరువాత కళాశాలలో జాయిన్ అయిన విద్యార్థులు కష్టపడి చదివి అనుకున్న లక్ష్యాలను నెరవేర్చుకోవాలి. ఇంటర్మీడియట్‌లో ఆకర్షణకు గురై చదువును అశ్రద్ధ చేయవద్దు. ఈ వయసులో విద్యార్థులు ఎక్కువగా సినిమా, షికార్లు, ప్రేమ అంటూ తొందరపాటు నిర్ణయాలు తీసుకోకుండా చదువుపై దృష్టిసారించాలి. చిన్న చిన్న విషయాలకు ఒత్తిడికి లోనుకాకుండా అన్ని విషయాలు తల్లిదండ్రులతో పంచుకుని భవిష్యత్తును చక్కదిద్దుకోవాలి.

– బూరాడ శివకృష్ణ, మోటివేషనల్ స్పీకర్, రాజాం

### ఏదో తెలియని లోకంలా..



పదో తరగతి వరకు చదివిన విద్యార్థులు ఇంటర్‌మీడియట్‌లో చేరగానే ఏదో తెలియని లోకంలో విహరిస్తున్నట్లు స్వేచ్ఛాజీవిగా భావిస్తారు. కాలేజీ చదువు ఎంతో విలువైనది. ముఖ్యంగా చెడు వ్యసనాలు, కళాశాలకు డుమ్మా కొట్టడం వంటివాటి బారిన పడకుండా తల్లిదండ్రులు శ్రద్ధ వహించాలి. అప్పుడప్పుడు కళాశాలలకు వెళ్లి పిల్లల స్థితిగతులను అడిగి తెలుసుకోవాలి.

– వారాడ వంశీకృష్ణ, వక్తిత్వ వికాస నిపుణుడు, రాజాం

# ఉత్కంఠ భరితంగా ఉమెన్ టీ–20 క్రికెట్ లీగ్

• సూపర్ ఓవర్‌లో విజయం సాధించిన వైజాగ్ డాల్ఫిన్స్
• చివరి ఓవర్‌లో గెలుపొందిన విజయనగరం రాయల్స్



వైజాగ్ డాల్ఫిన్స్ జట్టు



విజయనగరం రాయల్స్ జట్టు

విజయనగరం: విజయనగరం వేదికగా ఆంధ్రాక్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఉమెన్ టీ–20 క్రికెట్ లీగ్ టోర్నీ 3వ రోజు ఉత్కంఠ భరితంగా సాగింది. డెంకాడ మండలం చింతలవలసలో గల డాక్టర్ పీవీజీ రాజు ఏసీఏ స్పోర్ట్స్ కాంప్లెక్స్ ప్రాంగణంలో మంగళవారం రెండు మ్యాచ్‌లు నిర్వహించారు. ఉదయం వైజాగ్ డాల్ఫిన్స్– రాయలసీమ క్వీన్స్ జట్ల మధ్య జరిగిన మ్యాచ్‌లో వైజాగ్ డాల్ఫిన్స్ జట్టు సూపర్ ఓవర్‌లో విజయం సాధించింది. టాస్ ఓడిన వైజాగ్ డాల్ఫిన్స్ జట్టు ముందుగా బ్యాటింగ్ ప్రారంభించి నిర్ణీత 20 ఓవర్లలో 3 వికెట్లు నష్టపోయి 161 పరుగులు చేసింది. అనంతరం బ్యాటింగ్ ప్రారంభించిన రాయలసీమ క్వీన్స్ జట్టు 20 ఓవర్లు ముగిసే సమయానికి 6 వికెట్లు నష్టపోయి 161 పరుగులు చేయడంతో మ్యాచ్ టై అయింది. దీంతో అంపైర్లు సూపర్ ఓవర్ ఆడించగా.. వైజాగ్ డాల్ఫిన్స్ జట్టు వికెట్ నష్టపోయి 21 పరుగులు జోడించగా.. రాయలసీమ క్వీన్స్ జట్టు 18 పరుగులు మాత్రమే చేయగలిగింది. మధ్యాహ్నం విజయనగరం రాయల్స్– బెజవాడ బ్లేజర్స్ జట్ల మధ్య జరిగిన మరో మ్యాచ్‌లో విజయనగరం రాయల్స్ జట్టు విజయం సాధించింది. టాస్ గెలిచిన బెజవాడ బ్లేజర్స్ జట్టు ముందుగా బ్యాటింగ్ ప్రారంభించి నిర్ణీత 20 ఓవర్లలో 8 వికెట్లు నష్టపోయి 124 పరుగులు చేసింది. అనంతరం బ్యాటింగ్ చేసిన విజయనగరం రాయల్స్ జట్టు 19.5 ఓవర్లలో 4 వికెట్లు నష్టపోయి 125 పరుగులు చేసి 6 వికెట్ల తేడాతో విజయం సాధించింది.

# ఈనెల 8లోగా దరఖాస్తు చేసుకోవాలి

పార్వతీపురం: స్టాఫ్‌సెలక్షన్ కమిషన్ (ఎస్ఎస్‌సీ) గ్రూప్ సి ఉద్యోగాలకు ఈనెల 8లోగా దరఖాస్తు చేసుకోవాలని యువజన సర్వీసుల శాఖ ముఖ్య కార్యనిర్వహణాధికారి బి. రామగోపాల్ మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. గ్రూప్ సి స్థాయిలో లోయర్ డివిజనల్ క్లర్క్, జూనియర్ సెక్రటేరియట్ అసిస్టెంట్, డేటా ఎంట్రీ ఆపరేటర్ ఉద్యోగ నియామకాలు ఉంటాయని పేర్కొన్నారు. ఆన్‌లైన్‌లో 8వ తేదీలోగా దరఖాస్తులు సమర్పించి 10వ తేదీలోగా ఆన్‌లైన్‌లోనే ఫీజు చెల్లించవచ్చని ఆసక్తి గల యువత అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు.

# 322 మంది జర్నలిస్టులకు అక్రిడిటేషన్లు

• ఆమోదం తెలిపిన కమిటీ



మాట్లాడుతున్న కలెక్టర్ నాగలక్ష్మి

విజయనగరం అర్బన్: 2023–24 సంవత్సరాల కాలపరిమితికి గాను విజయనగరం జిల్లాలో పని చేస్తున్న 322 మంది జర్నలిస్టులకు అక్రిడిటేషన్ల జారీకి జిల్లా మీడియా అక్రిడిటేషన్ కమిటీ ఆమోదం తెలిపింది. ఈ మేరకు కలెక్టర్ నాగలక్ష్మి ఎస్ అధ్యక్షతన మంగళవారం ఆమె చాంబర్‌లో జిల్లా స్థాయి అక్రిడిటేషన్ కమిటీ సమావేశం జరిగింది. ఆన్‌లైన్ ప్రక్రియలో స్వీకరించిన దరఖాస్తుల పరిశీలనలో జీఓ నంబర్ 38లో పేర్కొన్న నిబంధనలు, జర్నలిస్టుల అర్హతా ప్రమాణాలు తదితర అంశాలపై చర్చ సాగింది. ఆన్‌లైన్ ప్రక్రియ ద్వారా ప్రింట్, ఎలక్ట్రానిక్ మీడియా, ఇతర విభాగాల నుంచి జిల్లా వ్యాప్తంగా 385 మంది దరఖాస్తు చేసుకోగా జీఓ నంబర్ 38 నిబంధనల మేరకు అన్ని అర్హతలున్న 322 మందికి అవకాశం కల్పిస్తూ కమిటీ అంగీకారం తెలిపింది. వారిలో పెద్ద, చిన్న తరహా పత్రికలు, పీరియాడికల్స్ నుంచి 165, ఎలక్ట్రానిక్ మీడియా నుంచి 122, ఫ్రీలాన్స్, వెటరన్, ఇతర విభాగాల 35 మంది జర్నలిస్టులు ఉన్నారు. సమావేశంలో భాగంగా జిల్లా మీడియా అక్రిడిటేషన్ కమిటీ కన్వీనర్ అండ్ జిల్లా సమాచార సంబంధాల అధికారి డి.రమేష్ దరఖాస్తులను పరిశీలించి జీఓ నంబర్ 38లోని నియమ నిబంధనలు, ఇతర అంశాల గురించి సభ్యులకు వివరించారు. అర్హత కలిగిన జర్నలిస్టులకు సంబంధించిన ప్రతిపాదనలు సమర్పించగా అక్రిడిటేషను జారీ చేయాలని పేర్కొంటూ సభ్యులందరూ సమ్మతి తెలిపారు. చిన్న పత్రికలకు సంబంధించి రెవెన్యూ డివిజన్ ప్రాతిపదికన అదనంగా మరో రెండు అక్రిడిటేషన్లు మంజూరు చేయాలని, స్టేట్ బస్‌పాస్ ఉన్నవారికి ఏసీ బస్సులో ప్రయాణించే అవకాశం కల్పించాలని కోరుతూ కమిషనర్, సమాచార పౌర సంబంధాల శాఖకు కలెక్టర్ ద్వారా లేఖ రాయాలని కమిటీ సభ్యులు సూచించారు. సమావేశంలో డీఆర్ఓ ఎం.గణపతిరావు, జిల్లా సమాచార పౌరసంబంధాల అధికారి డి.రమేష్, గృహ నిర్మాణ శాఖ పీడీ రమణమూర్తి, ఆర్టీసీ జిల్లా అధికారి అప్పలనారాయణ, శ్రీనివాసరావు, ఆరోగ్యశ్రీ కో–ఆర్డినేటర్ అప్పలరాజు, అసిస్టెంట్ లేబర్ కమిషనర్ శ్రీనివాసులు, ఇతర కమిటీ సభ్యులు అల్లు సూరిబాబు (సాక్షి), కె.రమేష్ నాయుడు (ప్రజాశక్తి), వి.వెంకట జగన్నాథరావు (ఎన్.టీవీ), ఎంఎంఎల్‌నాయుడు (10టీవీ), కే.జే. శర్మ (అక్షర కెరటం), బి.జోగారావు (ఆంధ్రజ్యోతి) తదితరులు పాల్గొన్నారు.

# ఉపముఖ్యమంత్రికి ఎంపీ పరామర్శ



ఉపముఖ్యమంత్రి పీడిక రాజన్నదొరతో మాట్లాడుతున్న ఎంపీ బెల్లాన చంద్రశేఖర్

సాలూరు: కాలిగాయంతో బాధపడుతున్న ఉపముఖ్యమంత్రి, గిరిజన సంక్షేమశాఖామంత్రి పీడిక రాజన్నదొరను విజయనగరం ఎంపీ బెల్లాన చంద్రశేఖర్ మంగళవారం పరామర్శించారు. ఈ మేరకు ఉపముఖ్యమంత్రిని సాలూరు పట్టణంలోని ఆయన గృహంలో కలిశారు. ఈ సందర్భంగా ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకుని త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు.

### హోంగార్డ్‌కు చేయూత



రిటైర్డ్ హోంగార్డ్ సుంకరి ఎల్లమ్మకు చెక్ అందజేస్తున్న ఎస్పీ ఎం.దీపిక

విజయనగరం క్రైమ్: జిల్లా పోలీసు శాఖలో పని చేసి, ఇటీవల ఉద్యోగ విరమణ పొందిన హోంగార్డ్ సుంకరి ఎల్లమ్మకు పోలీసులు తమ ఒకరోజు అలవెన్స్ రూ. 3 లక్షల 20వేల 920ల చెక్‌ను ఎస్పీ ఎం.దీపిక చేతులమీదుగా మంగళవారం అందజేశారు. ఈ సందర్భంగా ఎల్లమ్మ మాట్లాడుతూ జిల్లా పోలీసులకు తమ శాఖ పూర్తి అండగా నిలుస్తోందంటూ, తనకు సహకరించిన వారందరికీ అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో అదనపు ఎస్పీ అస్మా ఫర్హీన్, ఏఆర్ డీఎస్పీ ఎల్.శేషాద్రి, కార్యాలయ పర్యవేక్షకులు ప్రభాకరరావు, తదితరులు పాల్గొన్నారు.

# త్రుటిలో తప్పిన పెనుప్రమాదం

• రైల్వేగేటు పడి పగిలిపోయిన ఆటో అద్దాలు
• భయాందోళకు గురైన ప్రయాణికులు



సాంకేతిక సమస్య వల్ల తెరిచిన సమయంలో కిందికి పడి పోతున్న రైల్వే గేటు

గజపతినగరం: మండలంలోని పురిటిపెంట రైల్వే గేటు తెరుస్తున్న సమయంలో వెళ్తున్న ఆటోపై గేటు పైకి లేచి ఒక్కసారిగా కింద పడడంతో ఆటో అద్దాలు పగిలిపోయాయి. మంగళవారం జరిగిన ఈ సంఘటన వివరాలిలా ఉన్నాయి,. పురిటి పెంట రైల్వే గేటు మీదుగా నిత్యం ఆరు, ఏడు గ్రామాల ప్రజలు రాకపోకలు సాగిస్తూ ఉంటారు. ఈ క్రమంలో మంగళవారం గుంటూరు నుంచి రాయగడ వెళ్లే ఎక్స్‌ప్రెస్ గజపతినగరం మీదుగా వెళ్లడంతో ముందుగా గేట్‌మన్ గేటు వేశాడు. ఇరువైపులా ప్రయాణికులు నిరీక్షించి ఉన్నారు. రైలు వెళ్లిపోయిన తరువాత గేటు తెరవడంతో ప్రయాణికులు అంతా రద్దీగా వెళ్ల సాగారు. తెరిచిన ఒక వైపు గేటు (తూర్పున ఉన్న గేటు)పైకి లేచి గజపతినగరం నుంచి మెంటాడ వెళ్తున్న ఆటోపై పడడంతో ఒక్కసారిగా పడిపోయింది. ఆటోలో ఉన్న ప్రయాణికులు, పక్కనే ఉన్న ద్విచక్రవాహనదారులు, భయాందోళనకు గురయ్యారు. పడిపోయిన గేటును కొంతమంది ప్రయాణికులు సాహసం చేసి అడ్డుకోవడంతో పెనుప్రమాదం తప్పింది.

### పటువర్ధనంలో చోరీ

వంగర: మండలంలోని పటువర్ధనం గ్రామంలో పట్టపగలే చోరీ జరిగింది. మంగళవారం మధ్యాహ్నం ఒంటిగంట సమయంలో గ్రామానికి చెందిన చుక్కల చిన్నప్పమ్మ రెండు తులాల బంగారం పుస్తెల తాడును గుర్తు తెలియని వ్యక్తులు దొంగిలించి, పరారయ్యారు. తన ఇంటికి సమీపంలోని బంధువుల ఇంటికి వెళ్లినప్పుడు గమనించిన దొంగలు ఆమె ఇంట్లోకి చొరబడి, ట్రంకు పెట్టె తాళం పగలగొట్టి, అందులోని పుస్తెలతాడును దొంగిలించారు. ఇదే ఘటనపై బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు, ఎస్ఐ జనార్దనరావు ఘటన స్థలాన్ని పరిశీలించి, పలు వివరాలు సేకరించారు. రూ.26 వేల నగదు, అరతులం బంగారపు చెవిరింగులు, వదిలి పుస్తెల తాడు పట్టుకుపోయినట్లు ఆమె ఫిర్యాదులో పేర్కొంది.

# గాయపడిన నెమలి అటవీశాఖకు అప్పగింత

• ఫలించిన వైద్యసేవలు



గాయమైన నెమలిని అప్పగించిన పోలీసులు

సీతంపేట: స్థానిక పోలీసులు సారా బట్టీలపై దాడులకు ఎస్సై ఎ.నీలకంఠరావు ఆధ్వర్యంలో పులిగుమ్మి గ్రామానికి మంగళవారం వెళ్తుండగా ఫారెస్టు ఏరియాలో గాయాలైన నెమలిని చూసి పట్టుకుని సపర్యలు చేశారు. వెంటనే పాలకొండ అటవీశాఖకు సమాచారం చేరవేసి ఎఫ్‌బీవో దాలినాయుడు, సిబ్బందికి నెమలిని అప్పగించారు. బుధవారం విశాఖపట్నం జూకు తరలించేందుకు ఏర్పాట్లు చేసి నెమలికి ప్రత్యేక వైద్యసేవలు అందజేశారు. అయినా ఫలితం లేకపోవడంతో నెమలి మృతి చెందింది. డీఎఫ్‌వో ప్రసూన ఆధ్వర్యంలో చిన్నబగ్గ రిజర్వ్‌ఫారెస్టు ఏరియాలో పంచనామా చేసి దహనం చేశారు.

## కోడిగుడ్ల ధరలు

| హోల్‌సేల్ ధరలు | (100 గుడ్లు) |
|---|---|
| విశాఖపట్నం | రూ. 515.00 |
| విజయనగరం | రూ. 519.00 |
| శ్రీకాకుళం | రూ. 519.00 |

## బులియన్

| విశాఖపట్నం | |
|---|---|
| బంగారం(24సి. 10గ్రా.) | 60,650–00 |
| బంగారం(22సి. 10గ్రా.) | 55,600–00 |
| వెండి (కిలో) | 78,000–00 |

## చికెన్

బ్రాయిలర్

| లైవ్ | డ్రెస్డ్ | స్కిన్‌లెస్ |
|---|---|---|
| ₹157 | ₹284 | ₹ 294 |

# భక్తజన పురం

• తారాపురంలో వైభవంగా చింతాలమ్మతల్లి సిరిమానోత్సవం
• అమ్మవారి సేవలో ఎంపీ బెల్లాన, ఎమ్మెల్యే శంబంగి, మాజీ ఎంపీ బొత్స ఝాన్సీ



తారాపురంలో సిరిమానోత్సవం



సిరిమాను వద్ద పూజలు చేస్తున్న ఎమ్మెల్యే శంబంగి



సిరిమానోత్సవంలో భక్తజనం

రామభద్రపురం:

చింతాలమ్మా.. చల్లంగ చూడమ్మా... అంటూ భక్తులు స్మరించారు. ఆధ్యాత్మిక చింతనతో గడిపారు. సిరిమాను పూజారి పొట్టంగి తమ్మినాయుడు రూపంలో వీధుల్లోకి వచ్చిన అమ్మవారిని చూసి తరించారు. భక్తిశ్రద్ధలతో పూజలు చేశారు. ఆశీర్వచనాలు అందుకున్నారు. రామభద్రపురం మండలం తారాపురం గ్రామంలో ఐదుగురు అమ్మవార్లు చింతాలమ్మ, కొత్తమ్మ, బంగారమ్మ, టీకాలచ్చన్నమ్మ, తారాదేవి అమ్మవార్ల పండగ మంగళవారం అంగరంగ వైభవంగా జరిగింది. మధ్యాహ్నం 3.30 గంటల ప్రాంతంలో జరిగిన చింతాలమ్మతల్లి సిరిమానోత్సవాన్ని తిలకించేందుకు ఉత్తరాంధ్రతో పాటు ఒడిశా రాష్ట్రానికి చెందిన భక్తులు తరలివచ్చారు.

దీంతో తారాపురం భక్తపురంగా మారింది. వేకువజాము నుంచి అమ్మవార్లకు పూజలు చేశారు. మొక్కుబడులు చెల్లించారు. ఎంపీ బెల్లాన చంద్రశేఖర్, ఎమ్మెల్యే శంబంగి వెంకట చినఅప్పలనాయుడు, మాజీ ఎంపీ బొత్స ఝాన్సీలక్ష్మి, ఎంపీపీ చొక్కాపు లక్ష్మణరావు, జెడ్పీటీసీ సభ్యురాలు అప్పికొండ సరస్వతి, బొబ్బిలి మున్సిపల్ చైర్మన్ ఎస్.వి.మురళీకృష్ణారావు, వైఎస్సార్‌సీపీ బొబ్బిలి మండలాధ్యక్షుడు శంబంగి వేణుగోపాలనాయుడు తదితరులు అమ్మవారిని దర్శించారు. డీఎస్పీ శ్రీధర్ ఆధ్వర్యంలో సీఐ తిరుమలరావు, ఆరుగురు ఎస్ఐలు, వంద మంది పోలీసులు బందోబస్తు విధులు నిర్వహించారు.